నమస్తే తెలంగాణ
నిర్మల్
5 | నిజామాబాద్, శుక్రవారం 26 జనవరి 2024 | NIRMAL

భవన నిర్మాణానికి భూమిపూజ

నిర్మాణ పనులపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం, జనవరి 25 : రిమ్స్ దవాఖానలో కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం పథకం కింద మంజూరు చేసిన క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జిల్లాలో ఆరోగ్య సేవలను విస్తృత పరచడానికి భవనాలను నిర్మిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, సీనియర్ వైద్యులు తిప్పస్వామి, ఈఈ నరసింహారావు, బీజేపీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు ఉన్నారు.

వైభవంగా ఖాందేవ్ జాతర

ఖాందేవ్ ఆలయానికి కాలినడకన వెళ్తున్న తొడసం వంశీయులు

నార్నూర్, జనవరి 25 : మండల కేంద్రంలోని తొడసం వంశీయుల మహాపూజతో పుణ్యభూమిలో ఖాందేవ్ జాతర వైభవంగా ప్రారంభమైంది. మాన్కాపూర్‌లో తొడసం వంశీయులు మైసేమాల్ పేన్ సంప్రదాయ పూజలు చేశారు. ఖాందేవ్ ఆలయానికి కాలినడకన బయలుదేరారు. గురువారం అర్ధరాత్రి ఆలయంలో దేవతామూర్తులకు తొడసం వంశీయులు సంప్రదాయం ప్రకారం పూజలు చేసి, గంగాజలంతో అభిషేకించారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఆ వంశం ఆడ పడుచు తైలం తాగే మహోన్నత కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఇబ్బందులు కలుగకుండా చూడాలి..

కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్

ఇచ్చోడ, జనవరి 25 : మార్కెట్ యార్డులో కందులను విక్రయించుకోవడానికి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో నిర్వహించిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సకాలంలో డబ్బులు అందించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రీతంరెడ్డి, ఎంపీటీసీలు శివకుమార్, వెంకటేశ్, డీటీ రామారావు, సర్పంచ్ సునీత, ఉపసర్పంచ్ శిరీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాండు, రమేశ్, గణేశ్, అజీమ్ పాల్గొన్నారు.

బోథ్ మార్కెట్ యార్డులో..

బోథ్, జనవరి 25 : రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే జాదవ్ అన్నారు. బోథ్ మార్కెట్ యార్డులో కందుల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రుక్మన్‌సింగ్, జడ్పీటీసీ సంధ్యారాణి, సహకార సంఘం చైర్మన్ ప్రశాంత్, సర్పంచ్ సురేందర్ యాదవ్ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధి భేష్

నార్నూర్, జనవరి 25 : పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు బాగు ఉన్నాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా అన్నారు. గురువారం మండలంలోని మాన్కాపూర్ పంచాయతీని సందర్శించారు. పంచాయతీ పరిధిలో చేపట్టిన క్రీడాప్రాంగణం, పంచాయతీ భవనం, మురికి కాలువలు, మొక్కల పెంపకం వంటి పనులను పరిశీలించారు. పంచాయతీని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసిన సర్పంచ్ రాథోడ్ సావిందర్‌ను అభినందించారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. గాదిగూడ, నార్నూర్ మండలాల జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణలో భాగంగా ధ్రువీకరణ పత్రాలను ఆమె పరిశీలించారు. ఆమె వెంట డీఎల్‌పీవో భిక్షపతి గౌడ్, ఎంపీడీవో రమేశ్, గాదిగూడ ఇన్‌చార్జి ఎంపీడీవో రాథోడ్ గంగాసింగ్, ఐటీడీఏ ఏఈ రాథోడ్ సునీల్, ఉప సర్పంచ్ రాయిసిడాం రూప్‌దేవ్, పంచాయతీ కార్యదర్శి లవ్‌కుమార్ ఉన్నారు.

ఐకేపీ సభ్యురాలికి అరుదైన గౌరవం

- గణతంత్ర వేడుకలకు రావాలని ఆహ్వానం

భర్తతో కలిసి ట్రెయిన్‌లో ఢిల్లీ వెళ్తున్న దయాశీల

దిలావర్‌పూర్, జనవరి 25 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్ గ్రామ సంఘం అధ్యక్షురాలు ఇప్ప దయాశీలకు అరుదైన గౌరవం దక్కింది. 2004 సంవత్సరంలో గ్రామ స్వయం సహాయక సంఘంలో చేరి బ్యాంకు, స్త్రీనిధి ద్వారా రుణం తీసుకున్నది. ఈ డబ్బులతో తన భర్తకు మోటారు వెల్డింగ్ దుకాణం ఏర్పాటు చేయించింది. తద్వారా వారు ఆర్థికంగా బలోపేతం చెంది పిల్లలను ఉన్నతస్థాయికి చేర్పించింది. ఈ క్రమంలో ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు రావాలని ఆహ్వానం అందింది. దయాశీలకు శుక్రవారం జరిగే వేడుకల్లో ప్రత్యక్షంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం విననున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు బుధవారం ఇంటి నుంచి బయలు దేరిందని డీఆర్డీవో విజయలక్ష్మి, మండల ఐకేపీ ఏపీఎం సులోచనారెడ్డి తెలిపారు.

ఏరియా దవాఖానను సందర్శించిన కాయకల్ప బృందం

భైంసా, జనవరి 25 : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానను గురువారం కాయకల్ప బృందం సభ్యులు పరిశీలించారు. సేవల వివరాలు, ఆపరేషన్ థియేటర్, జనరల్ వార్డు, ఆరోగ్యశ్రీ, ప్రసూతి విభాగం, ఆసుపత్రి శుభ్రత, వార్డుల్లో రోగుల పడకలు, సిబ్బంది అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలించిన వారిలో కాయకల్ప బృందం సభ్యులు శ్రీకాంత్, కైలాష్, ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ కాశీనాథ్, అనిల్, క్వాలిటీ కంట్రోల్ అధికారి రిజ్వాన్ పాల్గొన్నారు.

దవాఖానలో వివరాలు సేకరిస్తున్న కాయకల్ప బృందం సభ్యులు

మన అడవే.. పులికి రక్ష

టైగర్స్‌కు కేరాఫ్‌గా మారుతున్న ఆదిలాబాద్ అడవులు

- కేసీఆర్ సర్కారు హయాంలో పెరిగిన ఫారెస్ట్ విస్తీర్ణం
- 50 హెక్టార్లలో జింకల పెంపకం కేంద్రం ఏర్పాటు
- స్మగ్లర్లు, వేటగాళ్లపై పీడీ యాక్ట్‌తో ఉక్కుపాదం
- అడవులు పెరగడానికి దోహదపడిన హరితహారం
- మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అడవుల నుంచి రాక
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 14 పులుల ఆవాసం

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం పచ్చదనాన్ని పెంపొందించడంతోపాటు అడవుల రక్షణకు చర్యలు తీసుకున్నది. ఫలితంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అటవీ విస్తీర్ణం విపరీతంగా పెరిగింది. ఈ దట్టమైన అడవులు జంతువులకు ఆవాసాలుగా మారడంతోపాటు పులుల సంచారం అధికమైంది. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి జిల్లాలో వివిధ ప్రాంతాలకు వచ్చి ఇక్కడే అవాసం ఏర్పరచు కుంటున్నాయి. వీటి సంతతిని పెంపొందించడానికి కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కవ్వాల్ అభయారణ్యంలో 50 హెక్టార్ల విస్తీర్ణంలో జింకల పెంపకాన్ని చేపట్టింది.

మావల వద్ద జాతీయ రహదారికి పక్కన అటవీ ప్రాంతం


భీంపూర్ మండలం తాంసి(కే) రోడ్డుపై పులి, పిల్లలు, పిప్పల్‌కోటి అటవీ ప్రాంతంలో పులి సంచారం (ఫైల్)

ఆదిలాబాద్, జనవరి 25(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో ఆదిలాబాద్ జిల్లాలోని అడవులను స్మగ్లర్లు యథేచ్ఛగా నరికివేసేవారు. దీంతో అటవీ విస్తీర్ణం బాగా తగ్గింది. దట్టమైన అడవులు అంతరించిపోవడంతో జంతువులకు ఆవాసం లేకుండా పోయింది. వేటగాళ్లు కూడా జంతువులను వేటాడటానికి అనుకూలంగా మారింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం అడవుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అడవులను ధ్వంసం చేస్తున్న వారిపై పీడీ యాక్టులు నమోదు చేయడంతోపాటు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి సాయుధ పోలీసులను నియమించింది. అడవులను కాపాడడంలో విఫలమైన అటవీశాఖ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. సరిహద్దులను గుర్తించి స్మగ్లర్లు, వేటగాళ్లు రాకుండా ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు. అటవీ శాఖలో ఖాళీగా పోస్టులను భర్తీ చేసింది. హరితహారం అడవుల అభివృద్ధికి దోహదపడింది. పలుచగా ఉన్న అటవీ ప్రాంతాల్లో బల్క్ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. నరికివేతకు గురైన చెట్ల మొదళ్లు సహజంగా పెరిగేలా ఏఎన్ఆర్ విధానాన్ని చేపట్టారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అడవులు పూర్వవైభవాన్ని సంతరించుకున్నాయి.

పులులకు ఆవాసంగా అడవులు

ఉమ్మడి రాష్ట్రంలో అడవుల నరికివేత కారణంగా జంతువులు వేటగాళ్ల బారిన పడడం, ఆవాసాలు కరువవడంతో పక్కనే ఉన్న మహారాష్ట్ర అడవుల్లోకి వెళ్లాయి. తెలంగాణ వచ్చిన తర్వాత అడవుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల కారణంగా ఉమ్మడి జిల్లాలో పులుల సంఖ్య పెరిగింది. జిల్లాలో అడవులు మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం జిల్లా అడవులకు అనుకుని ఉంటాయి. ఒక పులి నివాసం ఉండటానికి 25 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం అవసరమవుతున్నది. జిల్లాలోని అడవులు పులుల ఆవాసానికి యోగ్యంగా ఉండడంతో పాటు వాటికి ఆహారం లభిస్తుండడంతో తిప్పేశ్వర్ అడవుల నుంచి ఇక్కడికి వస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 14 పులులు ఉన్నట్లు గతంలో అటవీశాఖ అధికారులు గుర్తించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 8, ఆదిలాబాద్‌లో 4, మంచిర్యాలలో 2 పులులు నివాసం ఉంటున్నట్లు అధికారులు తెలిపారు.

సంఖ్య పెరిగేలా అధికారుల చర్యలు

ఇప్పటికే పులుల సంఖ్య పెరుగగా వాటి సంతానోత్పత్తికి కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పులులు ప్రధానంగా దుప్పులు, జింకలను ఆహారంగా తీసుకుంటాయి. జిల్లాలో సంచరిస్తున్న పులులు ఆహారం కోసం పశువులు, మనుషులపై దాడులకు పాల్పడిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి కేసీఆర్ ప్రభుత్వం కవ్వాల్ అభయారణ్యంలో ఆహారం లభించేలా ప్రణాళికలు తయారు చేసింది. టైగర్ జోన్‌లో 50 హెక్టార్లలో జింకల పెంపకం కేంద్రాన్ని ప్రారంభించింది. జింకలకు ఆహారంగా గడ్డిని పెంచడంతోపాటు తాగునీరు లభించేలా సాసర్‌పిట్‌లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నది. కేసీఆర్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా జింకల సంఖ్య పెరుగుతున్నది. పులులతోపాటు తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చినని వీటిని ఆహారంగా తీసుకుంటాయి. ఆడ, మగ పులులు ఇక్కడే ఉంటూ సంతానోత్పత్తి చేస్తున్నాయి. ఫలితంగా జిల్లాలో పులుల సంఖ్య బాగా పెరుగుతున్నది.

ఘనంగా ఓటరు దినోత్సవం

- ఎన్‌టీఆర్ స్టేడియం నుంచి ర్యాలీ నిర్వహించిన అధికారులు

ప్లకార్డులతో అధికారులు

నిర్మల్ అర్బన్, జనవరి 25 : ఓటు వజ్రాయుధం అని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి స్థానిక శివాజీ చౌక్ వరకు ఓటరుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జెండా ఊపి ప్రారంభించారు. ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు కిశోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకం - కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ టౌన్, జనవరి 25 : ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు విలువైనదని, అందుకే ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఓటు విలువను తెలుపుతూ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతులను అందించారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లను సన్మానించారు.

ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ ..

ఆదిలాబాద్ రూరల్, జనవరి 25 : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బైక్ ర్యాలీ నిర్వహించగా ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇందిర ప్రియదర్శిని స్టేడియం నుంచి ర్యాలీ ప్రారంభం కాగా రెవెన్యూ అదనపు కలెక్టరు శ్యామలాదేవి జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్, ఎస్పీ స్వయంగా బైక్‌ను నడిపారు.

ర్యాలీలో బైక్ నడుపుతున్న కలెక్టర్, ఎస్పీ

ప్రొటోకాల్ రగడ

- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో వివాదం
- జడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్ల ఆగ్రహం
- కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు

కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు చేస్తున్న జడ్పీటీసీలు, మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

ఆదిలాబాద్, జనవరి 25(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన కల్యాణలక్ష్మి-షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం వివాదానికి దారితీసింది. ఈ కార్యక్రమంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగిందంటూ ఆదిలాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం ఆదిలాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాలతోపాటు పట్టణంలోని వార్డుల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాయల్ శంకర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో, స్థానిక తహసీల్దార్, ఇతర అధికారులు హాజరుకాకపోవడంతో ఆయన కలెక్టర్‌కు ఫోన్ చేసి మండిపడ్డారు. కలెక్టర్ సూచనల మేరకు అధికారులు కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆదిలాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాలు, అర్బన్ ప్రాంతాల్లోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రగడకు దారితీసింది. ప్రొటోకాల్ పాటించలేదంటూ నియోజకర్గంలోని జడ్పీటీసీ, ఎంపీపీలు, మున్సిపల్ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులమైన తమకు ఎలాంటి సమాచారం లేకుండా అధికారులు కార్యక్రమం నిర్వహించారని సూచించారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పట్టణ పరిధిలో నిర్వహించిన కార్యక్రమానికి తమకు కనీస సమాచారం లేదని, అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమ నిర్వహణపై తమకు సమాచారం లేదన్నారు. ప్రజాప్రతినిధులకు తెలియకుండా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీని అధికారులు నిర్వహించారని పేర్కొన్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మహిళలను కింద కూర్చొబెట్టి, నాయకులు కుర్చీలపై కూర్చోవడం సమంజసం కాదని వారు సూచించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో బేల, మావల, జైనథ్ జడ్పీటీసీలు అక్షిత పవార్, నల్ల వనిత, తుమ్మల అరుంధతి, ఎంపీపీలు దర్శనాల సంగీత, వనిత ఠాక్రే, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ ఉన్నారు.

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టేజి ముస్తాబు

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

ఎదులాపురం, జనవరి 25 : గణతంత్ర వేడుకలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం సిద్ధమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరుకానున్నారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, గౌరవ వందన స్వీకరణ కార్యక్రమం ఉంటుంది. ఉదయం 8.55 గంటలకు ముఖ్య అతిథి రాక, 9 గంటలకు పతాకావిష్కరణ, 9:05కు పోలీస్ గౌరవ వందనం, 9:30కి ప్రసంగం, 9:45కు సాంస్కృతిక కార్యక్రమాలు, 10:30 గంటలకు ఉద్యోగులు, ఇతరులకు ప్రశంసాపత్రాల పంపిణీ, సాయంత్రం 5 గంటలకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.

గిరిగ్రామాల అభివృద్ధికి కృషి

లోహలో గిరిజనులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్పీ

దహెగాం, జనవరి 25 : గిరిగ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎస్పీ సురేశ్ కుమార్ పేర్కొన్నారు. 'పోలీసులు మీకోసం'లో భాగంగా గురువారం కర్జి పంచాయతీ పరిధిలోని లోహ గ్రామాన్ని ఆయన సందర్శించారు. 23 కుటుంబాలకు సామాజిక చారిటబుల్ ట్రస్టు ద్వారా సమకూర్చిన దుస్తులు, దుప్పట్లు, బియ్యం, ఇతర సరుకులను అందజేశారు. గిరివెళ్లి గెర్రె, కర్జి గ్రామాలకు చెందిన యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. డీఎస్పీ కరుణాకర్, రూరల్ సీఐ నాగరాజు, ఎస్ఐ సనత్‌కుమార్, సామాజిక కర్యకర్త సరిత పాల్గొన్నారు.

కొలాంలు బాగా చదువుకోవాలి..

- ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం
- పాటగూడతో దుప్పట్ల పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

ఇంద్రవెల్లి, జనవరి 25 : కొలాం గిరిజనులు తమ పిల్లలకు ఉన్నత చదువులు చదివించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా చేయాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. గురువారం మండలంలోని సమక పంచాయతీ పరిధిలోని పాటగూడలో ఇంద్రవెల్లి ఎస్ఐ సునీల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీకి గిరిజన మహిళలు తిలకం దిద్ది పువ్వులు చల్లుతూ, గుస్సాడీ నృత్యాల మధ్య స్వాగతం పలికారు. అనంతరం గుస్సాడీలతోపాటు గ్రామస్తుల ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. అనంతరం ఎస్పీ చేతుల మీదుగా 300ల మంది కొలాం గిరిజనులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. నేను గతంలో కూడా ఆదివాసీ జిల్లాలోనే విధులు నిర్వహించానని, మళ్లీ ఆదివాసుల జిల్లాలో విధులు నిర్వహించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కొలాంలు అన్ని రంగాల్లో రాణించి అభివృద్ధి చెందాలన్నారు. వీరి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పీఎం జనజాతి పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 18 వేల పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కొలాంల కోసం ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహించాలని ఎంపీటీసీ భీంరావ్ కోరారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ, స్పెషల్ పోలీస్ రామారావ్, పటేల్ కొడప లక్ష్మణ్, కారోబారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు స్థల పరిశీలన

- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
- ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తా

కేజీబీవీ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

ఇంద్రవెల్లి, జనవరి 25 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలానికి ఈ నెల 27, 28, 29 తేదీల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని ఎస్పీ గౌస్ ఆలం పేర్కొన్నారు. గురువారం మండలంలోని అమరవీరుల స్తూపం ప్రాంతంలోని ఖాళీ స్థలంతోపాటు కేజీబీవీ పాఠశాల గ్రౌండ్, ఐపీఎస్ పాఠశాలలోని హెలిప్యాడ్ గ్రౌండ్, కేస్లాపూర్ నాగోబా ఆలయ పరిసరాలను ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తాతో కలిసి ఎస్పీ పరిశీలించారు. సీఎం పర్యటన సందర్భంగా సమస్యలు లేకుండా అధికారులు, పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వాహనాల పార్కింగ్, ప్రజలతో బహిరంగా సభ నిర్వహించేందుకు సరిపడా స్థలంతోపాటు హెలిప్యాడ్ కోసం స్థలాన్ని ఎంపిక చేయాలని ఆదేశించారు. బందోబస్తుతోపాటు ప్రత్యేక భద్రత, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఐటీడీఏ ఈఈ భీంరావ్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ రామకృష్ణ, డీఎల్‌పీవో భిక్షపతిగౌడ్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో పుష్పలత, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఎస్ఐ సునీల్, గిర్దావర్ మెస్రం లక్ష్మణ్, ఈవో సంజీవరావ్ పాల్గొన్నారు.